క్లుప్తంగా

ప్రజలకు అవగాహన కల్పించాలి

నేరడిగొండ: సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సికిల్‌సెల్ అనేది జన్యుపరంగా వస్తుందని, వ్యాధి సోకిన వారికి రక్తహీనత సమస్య ఉంటుందన్నారు. వేసవిలో వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాంసి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భీంపూర్ పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని నిపాని గ్రామంలో గ్రామ ప్రజలకు మత్తుపదార్థాల ఉపయోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. గుట్కా, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఈద్గా వద్ద అభివృద్ధి పనులు

బోథ్: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద రూ.10 లక్షలతో నిర్మించబోవు పలు అభివృద్ధి పనులను బోథ్ కాంగ్రెస్ ఆడె గజేందర్, బోథ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వక్ఫ్ బోర్డుపై మోదీ ప్రభుత్వం అజమాయిషీ చేయాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పసుల చంటి, గొర్ల రాజు యాదవ్, షేక్ నాజర్ అహ్మద్, మహమ్మద్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

బోథ్: సొనాల మండలంలోని చింతల్‌బోరి గ్రామంలోనే రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో సిగ్నల్ లేకపోవడంతో గ్రామంలో రేషన్ ఇవ్వకుండా, సొనాల గ్రామంలో రేషన్ ఇచ్చేవారని అన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉందని, గ్రామంలోనే రేషన్ ఇవ్వాలని కోరారు.

జొన్న కొనుగోళ్లు ప్రారంభించాలి

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం జొన్న కొనుగోళ్లను ప్రారంభించాలని ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్నలు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సూరజ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు అరుగాలం కష్టపడి పండించిన జొన్న పంటను పూర్తిగా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భీమ బుచ్చన్న, మడావి మారుతి, మడావి భీంరావ్, మహేందర్ పాల్గొన్నారు.

నేలకొరిగిన జొన్న

నేరడిగొండ: రబీలో సాగు చేస్తున్న జొన్న, నువ్వు పంటలు అకాల వర్షాలతో దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి వాంకిడి, వడూర్, కుమారి, తర్నం, వాగ్దారి గ్రామాల్లో పంటలు నేలకొరిగాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. కాగా అకాల వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచించారు.

ఎంపీడీవో పర్యటన



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్ పర్యటించి వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ప్రజల అవసరాల మేరకు భగీరథ నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఎవరూ కూడా భగీరథ పైపులైన్‌కు రంధ్రాలు చేసుకొని నీటిని తీసుకోవద్దన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

బోథ్: మండల కేంద్రంలోని గుల్జార్ మసీదులో ముస్లింలు శుక్రవారం వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తాయన్నారు. ప్రభుత్వం బిల్లును పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను చేర్చడం, వక్ఫ్ యాజమాన్యాన్ని నిర్ణయించడానికి ప్రభుత్వ అధికారులకు అధికారాన్ని బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం



కెరమెరిలోని శివాలయం

- రేపు సీతారాముల కల్యాణం
- ముస్తాబైన శివాలయం
- సిద్ధమైన సీతమ్మ ఆభరణాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కెరమెరి: ఏడాదికి ఒకసారి వచ్చే వేడుకను వీక్షించడానికి భక్తుల ఎదురుచూస్తున్నారు. ప్రతీ ఏటా జరిగే వేడుకకు భిన్నంగా ఈసారి శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల భక్తులు స్వామి వారిని కల్యాణాన్ని కనులారా వీక్షించాలనుకుంటున్నారు., ఈసారి మహిళలు పెద్ద ఎత్తున హాజరవనున్నారు. పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమవుతున్న ఈ సంస్కృతిని.. పరిణయ వేడుకను ఆదివాసీ మండలమైన కెరమెరిలో కూడా రేపు బ్రహ్మాండంగా జరగనుంది.

రాముడు.. సీతమ్మ వేర్వేరుగా..

శ్రీరాముల వారు గ్రామపటేల్ వాడై సోనేరావు, స్వాతి దంపతుల ఇంటినుంచి పార్వతి మాతా ఉన్న పల్లెర్ల మధూకర్ ప్రమీల ఇంటికి భక్తులు వెళ్లారు. అక్కడి కొంత సేపు సేదతీరి శోభాయాత్రగా అశేష జనవాహిని మధ్య ఊరేగింపుగా శివాయాలనికి వస్తారు. శోభాయాత్రలో ఆంజనేయ భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. మహిమాన్వితుల పల్లకి 'జయ రామ.. శ్రీరామ.. జయజయరామ' అనే నామ జపంతో కొనసాగుతోంది. కల్యాణ మండపానికి శ్రీరాముడు చేరాక, పల్లెర్ల మధూకర్, ప్రమీల దంపతులు సీతమ్మను మండపానికి తీసుకువస్తారు. ప్రత్యేక పూజలనంతరం మధ్యాహ్నం 12:15 గంటలకు కెరమెరికి చెందిన అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ద్వారా శ్రీసీతారామును కల్యాణాన్ని వైభవంగా జరిపిస్తారు.

సీతమ్మకు పట్టువస్త్రాలు..

సీతమ్మను అత్యంత సుందరంగా అలంకరించనున్నారు. పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, బాసింగం, జీలకరబెల్లం ప్రత్యేక పూజా సామగ్రి తీసుకువచ్చారు. కన్యాదానం, వివాహం, అభిషేకం, కలశపూజ, గణపతి పూజ, మధుపర్క పూజ, మాంగళ్య ధారణ కొనసాగుతాయి. వివాహానంతరం మహిళలు మంగళ హారతులు ఇస్తారు. ఇప్పటికే ఆభరణాలు సిద్ధమయ్యాయి. స్వామి వారి వివాహాన్ని తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు రానున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న సిద్దల దేవయ్య

కౌటాల: పేదలకు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సదాశివపేట రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఐ దేవేందర్, కార్యదర్శి సాయికృష్ణ, డీలర్ బీకారు, పెద్దపల్లి భీమయ్య, హన్మంతు, నాహీం, విఠల్ పాల్గొన్నారు.

కెరమెరి: ప్రతీ జాబ్‌కార్డు ఉన్న పేద కుటుంబానికి సన్న బియ్యం అందించడం జరుగుతుందని ఆర్డీవో లోకేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషా పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, బొంబాయిగూడ, దరోగపల్లి గ్రామాల్లో అధికారులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, ఏఈ అబ్దుల్ ఖదీర్, ఆర్ఐ రాజేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న లోకేశ్వర్

బెజ్జూర్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మర్థిడిలో రేషన్ షాప్‌లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్, బుస శంకర్, ఆత్రం రాజారాం, దుర్గం దాసు, తొర్ర వినోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోలేటిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వ్యవసాయాధికారుల కొత్త ఫోన్ నంబర్లు

వాంకిడి: వ్యవసాయాధికారుల పాత ఫోన్ నంబర్లను తొలగించి కొత్త నంబర్లను ప్రభుత్వం కేటాయించింది. జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు డివిజన్లు, మండల అధికారుల నంబర్లు సైతం మారాయి. వ్యవసాయంలో సలహాలు, సూచనల కోసం రైతులు కొత్త నంబర్లకు ఫోన్ చేయాల్సి ఉంటుందని, రైతులు విషయాన్ని గమనించాలని జిల్లా వ్యవసాయాధికారి రావురి శ్రీనివాస్ తెలిపారు.

వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్లు..

పని చేసే స్థలం	హోదా	ఫోన్ నంబర్	పని చేసే స్థలం	హోదా	ఫోన్ నంబర్
ఆసిఫాబాద్ (జిల్లా కేంద్రం)	డీఏవో	8977748730	దహెగాం	ఏవో	8977748834
			జైనూర్	ఏవో	8977748835
ఆసిఫాబాద్	ఏడీఏ(టెక్నికల్)	8977748780	కాగజ్‌నగర్	ఏవో	8977748836
ఆసిఫాబాద్	ఏవో(టెక్నికల్)	8977748790	కెరమెరి	ఏవో	8977748837
ఆసిఫాబాద్	ఏవో(టెక్నికల్)	8977748799	కౌటాల	ఏవో	8977748842
ఆసిఫాబాద్	ఏవో(టెక్నికల్)	8977748801	లింగాపూర్	ఏవో	8977748843
ఆసిఫాబాద్	ఏడీఏ	8977748810	పెంచికల్‌పేట్	ఏవో	8977748845
కాగజ్‌నగర్	ఏడీఏ	8977748816	రెబ్బెన	ఏవో	8977748846
సిర్పూర్(యూ)	ఏడీఏ	8977748819	సిర్పూర్(టి)	ఏవో	8977748860
ఆసిఫాబాద్	ఏవో	8977748820	సిర్పూర్(యూ)	ఏవో	8977748867
బెజ్జూర్	ఏవో	8977748826	తిర్యాణి	ఏవో	8977748869
చింతలమానెపల్లి	ఏవో	8977748827	వాంకిడి	ఏవో	8977748870

వంతెన పూర్తయ్యేనా..?

- పునాది దశలోనే అప్పపల్లి వంతెన
- వర్షాకాలం లోపు పూర్తి చేయాలంటున్న ప్రజలు



అసంపూర్తిగా వంతెన నిర్మాణం

ఆసిఫాబాద్‌రూరల్: వంతెన నిర్మాణం పూర్తికాక అప్పపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత ఏడాది మేలో పనులు ప్రారంభించి పునాది దశలో ఉండగానే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులను తిరిగి ప్రారంభించకపోవడంతో ఈ సంవత్సరం వర్షకాలం లోపు వంతెన పూర్తి చేసి మా కష్టాలను తీర్చాలని ప్రజలు యవేడుకుంటున్నారు.

పునాదికే పరిమితం..

అప్పపల్లి మోతుగూడ గ్రామాలకు మధ్య ఉన్న వాగుపై వంతెన లేక ఏళ్ల తరబడి అప్పపల్లి, ఆర్ఆర్ కాలనీవాసులు నానా తంటాలు పడుతున్నారు. గత సంవత్సరం వంతెన నిర్మాణానికి రూ1.86 లక్షలు మంజూరయ్యాయి. పనులు గత జూన్‌లో సంబంధిత కాంట్రాక్టు ప నులు సైతం ప్రారంభించారు. మంత్రి సీతక్క సైతం 2024 జూన్ 12న పర్యవేక్షించి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. అప్పటి నుంచి నేటి వరకు పనులు చేపట్టాక పోవడంతో గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.


వర్షకాలంలో రాకపోకలు బంద్..

వర్షకాలం వచ్చిదంటే వాగు ప్రవాహం ఎక్కువ ఉండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అప్పపల్లి గ్రామం నుంచి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇంటివద్దనే ఉండాల్సి పరిస్థితి ఉంటుంది. గతంలో పైపులు వేసి తాత్కాలిక వంతెన ఏర్పాటు చేస్తుకున్నారు. వంతెన పనులు చేస్తున్న సమయంలో ఉన్న తాత్కాలిక వంతెనాను తొలగించడంతో రాక పోకలకు మరింత ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

గుండి వంతెన..

మండలంలోని గుండి వాగుపై నిర్మిస్తు వంతెన పనులు సైతం నత్తనడకన కొనసాగుతున్నాయి. ఎండకాలం పూర్తయ్యేలా కనిపించడం లేదు. వంతెన పనులు పునాదికే పరిమితం అయ్యాయి. జూలై నుంచి తిరిగి పనులు ప్రారంభం కాలేదు. మరో రెండు నెలల అయితే వర్షకాలం వస్తుంది. అధికారులు స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓంకార ఆశ్రమం.. భక్తి పారవశ్యం



ప్రవచనాలు చేస్తున్న గురువులు



హాజరైన భక్తులు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమం రాధాకృష్ణ ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా ప్రారంభించారు. ఓంకార ఆశ్రమం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఉదయం ప్రణవ పతాకావిష్కరణతో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గీతాపారాయణం, లలిత సహస్ర పారాయణం, నిత్యపూజలు చేస్తున్నారు. విష్ణుసేవానందగిరి స్వామి, శివరామకృష్ణ స్వామి, జగదీశ్వరానంద స్వామి, జ్ఞాన చైతన్యనంద స్వామి ప్రవచనాలు బోధించారు.

నేడు విగ్రహ ప్రతిష్టాపన



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం ప్రసన్న భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం అర్చకుడు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. హనుమాన్ విగ్రహాన్ని భాజ భజంత్రీలతో గ్రామంలో ఊరేగించారు.


అంబేడ్కర్ బాటలో నడవాలి



యాత్ర చేపడుతున్న నాయకులు

కెరమెరి: అంబేడ్కర్ బాటలో నడవాలని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నిషాని, ఇందాపూర్, గోండ్‌గూడ, ఆగర్వాడ, ఖైరీ గ్రామాల్లో జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వసంత్‌రావు, న్యానేశ్వర్, లింబారావు, నగేశ్, హన్మంతు, కుత్‌బోద్దీన్, శంకర్, విశ్వనాథ్, పాలక్‌రావు, ముకుంద్‌రావు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బెజ్జూర్: మండలంలోని రెబ్బెన గ్రామం వద్ద నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు పరిహారం చెల్లించాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు డిమాండ్‌చేశారు. పరిహారం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

కెరమెరి: మండలంలోని సావర్‌ఖేడా పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం వ్యవసాయ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ధనోరా గ్రామంలో వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను విద్యార్థులు పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారు చేసే విధానాన్ని రైతు కేంద్రే బాలాజీ విద్యార్థులకు ప్రత్యేక్షంగా చూపించారు. సేంద్రియ ఆహార ధాన్యాలు కొర్రలు, సజ్జలు, జొన్నలు, కూరగాయలు తినాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కడేర్ల రంగయ్య, పాఠశాల చైర్మన్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సేంద్రియ మిశ్రమాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

మండుటెండలో 'ఉపాధి'



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా కూలీలకు పని కల్పిస్తుంది. కూలీలకు నీడ కోసం టెంటు, మంచినీరు, వైద్య సదుపాయం కల్పించాల్సి ఉండగా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కూలీలు ఎండలోనే ఉపాధి పనులు చేస్తున్నారు.

– పెంచికల్‌పేట్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

నార్నూర్: భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాలేపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను అపహస్యం చేస్తూ బీజేపీ నాయకులు పార్లమెంట్‌లో మాట్లాడడం సరికాదన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు లోఖండే దేవురావు, బానోత్ ప్రణీత, షేక్ దాదే అలీ, పరమేశ్వర్, దుర్గే కాంతారావు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

కౌటాల: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. శ్రీదేవి భాగవతం ప్రవచన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రవచకులు బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ, ఫణిగంటి కిరణ్‌శర్మ భక్తులకు శ్రీదేవి భాగవతం ప్రవచనాన్ని బోధించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వొజ్జల వెంకన్న, ప్రశాంత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు